క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచలో ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నర్సింగం గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం రూ.10 లక్షల నిధులు మంజూరుకు కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, డైరెక్టర్ గంగు కొండయ్య, నాయకులు గంగు మహేశ్, నలువాల జలందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



ఇల్లంతకుంట: మండలంలోని కొత్తూరులో రైతులు సాగుచేస్తున్న పంట పొలాలను శుక్రవారం పొలాస వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు పరిశీలించారు. యాసంగిలో కాండం తొలిచే పురుగు సమస్యగా మారిందని, నివారణ చర్యలను ఆయన రైతులకు సూచించారు. జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్మోహన్ రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు డాక్టర్ గొన్యా నాయక్, డాక్టర్ బలరాం నాయక్, డాక్టర్ సాయినాథ్, రైతులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై దాడులు మానుకోవాలి'

చందుర్తి : ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులను భయభ్రాంతులకు గురిచేసేందుకు చేస్తున్న దాడులను మానుకోవాలని మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్యం అందించేందుకు ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణను ఇప్పించి, మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఇబ్బందులను గురి చేస్తోందన్నారు. అవగాహన లేకుండా వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గత ప్రభుత్వం లాగానే శిక్షణ ఇప్పించి వారి సుశిక్షితులుగా తీర్చిదిద్దాలని కోరారు.

ఖాళీ కుర్చీలు దర్శనం



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం వివిధ పనుల నిమిత్తం వచ్చిన మండల ప్రజలు ఇబ్బందిపడ్డారు. కార్యాలయంలో సగానికిపైగా సిబ్బంది లేకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శమిచ్చాయి. తహసీల్దార్ (ఎఫ్ఏసీ) జయంత్ కుమార్ సెలవులో ఉండగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆర్ఐ దినేశ్ బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయాన్ని ×సాక్షి¤ సందర్శించగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈ విషయమై డ్యూటీలో ఉన్న ఒక అధికారిని ప్రశ్నించగా వారు సర్వేలో ఉన్నారని సమాధానమిచ్చారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లెలో శుక్రవారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకుడు మిరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కదరి సునీల్ రెడ్డి, కొండెవెని ప్రశాంత్, దూది చంద్రయ్య, జంగం సత్తయ్య, మల్లయ్య, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్

గంభీరావుపేట: మండలంలోని కొండాపూర్‌లో మార్వాడి బొత్త వెంకటయ్య-నర్సవ్వల జ్ఞాపకార్థం గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. పోటీల్లో పది జట్లు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతికి రూ. 3వేల నగదు, ద్వితీయ బహుమతికి రూ. 2వేలు అందించనున్నట్లు నిర్వాహకులు మార్వాడి మౌనిక గంగరాజు తెలిపారు.

కోతుల దాడిలో కూలిన ఇల్లు



గంభీరావుపేట: ముస్తాబాద్ మండలం చీకోడులో కోతులు బీభత్సంసృష్టిస్తున్నాయి. శుక్రవారం గొట్టిగల్ల రాజయ్యకు చెందిన ఇల్లు కోతుల దాడిలో కూలిపోయింది. దీంతో ఇంట్లోని ఫ్రిజ్, టీవీ, బీరువాలు దెబ్బతిన్నాయి. కోతుల బెడద నుంచి కాపాడాలంటూ గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ చేసేదెప్పుడో?



ఐకేపీ ఆధీనంలో మిల్‌షెడ్లు



ఐకేపీ భవనాలు

- కోట్ల విలువైన ఆస్తికి పత్రాలు కరువు
- కొరవడిన సమన్వయం

ముస్తాబాద్: ఐకేపీ మండల సముదాయాల కోసం రెండు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన భూములకు పత్రాలు లేవు. ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయలేదు. ఫలితంగా కోట్ల రూపాయల విలువైన ఆస్తులకు పత్రాలు లేకుండా ఉన్నాయి. 2007లో కొనుగోలు చేసిన ఆస్తులు ఇప్పటికీ అప్పటి యజమాని పేరిటే ఉన్నాయి.

2007లో కొనుగోలు

ముస్తాబాద్ మండలకేంద్రంలో ఇందిరాక్రాంతి పథం (ఐకేపీ) శుభోదయ మండల సమాఖ్య భవన సముదాయం కోసం 2007లో రూ.20లక్షలతో ఓ రైస్‌మిల్లు స్థలాన్ని కొనుగోలు చేశారు. అప్పటి ప్రాజెక్టు డైరెక్టర్ చిరంజీవులు స్వశక్తి సంఘాల మహిళల కోసం ముస్తాబాద్, పోతుగల్ గ్రామాల మధ్య ఉన్న రైస్‌మిల్లును కొనుగోలు చేయించారు. 3.20 ఎకరాల్లోని రైస్‌మిల్లులో రెండు భారీ గోడౌన్‌లు, ఒక షెడ్డు, ఇతర భవనాలు ఉన్నాయి. రెండున్నర ఎకరాల ఖాళీ స్థలం ఉంది. మార్కెట్‌లో దీని విలువ రూ.5 కోట్ల పైమాటేనని పలువురు పేర్కొంటున్నారు.

స్వశక్తి సంఘాల స్వయం ఉపాధి

స్వశక్తి సంఘాల స్వయం ఉపాధి కోసం రైస్‌మిల్లును 18 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఆయిల్ మిల్‌ను రన్‌చేసి నూనె ఉత్పత్తులు చేయాలన్న లక్ష్యాన్ని నిర్ణయించారు. దాని కోసం పూర్తిస్థాయి కసరత్తు చేశారు. ఆ సమయంలోనే ప్రాజెక్టు డైరెక్టర్ చిరంజీవులు బదిలీ అయ్యారు. దీంతో ఆ ప్రాజెక్టు అటకెక్కింది. అనంతరం ఫంక్షన్‌హాల్ నిర్మించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రస్తుతం ఒక షెడ్డును సెస్‌కు అద్దెకు ఇవ్వగా, భవన సముదాయంలో ఐకేపీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.

ఎవరికీ పట్టని రిజిస్ట్రేషన్

ఐకేపీ భవన సముదాయం ప్రైవేటు వ్యక్తుల పేరుతో ఉండగా, ఐకేపీ అధికారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లు విక్రయించిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేస్తామని ముందుకొచ్చినా అధికారుల సమన్వయ లోపంతో రెండుసార్లు రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. కలెక్టర్ ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



2007లో కొనుగోలు చేసిన భవనాలు ఇంకా ఇతరుల పేరిట ఉన్నాయి. రిజిస్ట్రేషన్ చేసేందుకు వారు సిద్ధంగానే ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అందరినీ సమన్వయం చేసుకుని భవనాలను ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– దేవరాజు, ఏపీఎం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వేములవాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వేములవాడ రూరల్ ఎస్సై మారుతి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వేములవాడ రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వట్టెంల, హన్మాజీపేట, మర్రిపల్లి గ్రామాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.ఎస్సై మారుతి మాట్లాడుతూ...వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. కానిస్టేబుల్ రాజశేఖర్, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

సుంకె రవిశంకర్ దిష్టిబొమ్మ దహనం



మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండలంలోని తడగొండ గ్రామ బస్టాండ్ ఏరియాలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం దహనం చేశారు. ఇక్కడ ఏఎంసీ చేర్మెన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వీసీ నిమ్మ వినోద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, గుడి శేఖర్‌రెడ్డి, ఎండీ.హుస్సేన్, మండల శ్రీనివాస్, ఎండీ.రఫీ, ఎండీ. నజీర్ తదితరులు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం అంజయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడగాని వెంకటేశ్, మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్‌కుమార్, వినోద్‌రెడ్డి అన్నారు. ఇక్కడ మెరుపుల మహేశ్, గడ్డి కమలాకర్ తదితరులు ఉన్నారు.

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: జిల్లా టీజీవో సంఘం క్యాలెండర్, డైరీని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సమరసేన్, ఉపాధ్యక్షులు శరత్, మోతీలాల్, శ్రీకాంత్, సాగర్, శేఖర్ తదితరులు ఉన్నారు.

మజీద్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన పాలకవర్గ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్‌లో మజీద్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు(సదర్)గా ఎండీ షాకీర్, నాయాబ్ సదర్‌గా షాదుల్, కోశాధికారిగా ముక్తర్, అజీజ్, సభ్యులుగా ఎండీ షుకూర్, ఎండీ షాదుల్, రసూల్, గౌస్, బాబా, ఫారిజ్, సాబీర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని మండల కమిటీసభ్యులు అభినందించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	04	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	02	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	03	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	08	1,008
నందీశ్వర నాన్ఏసీ	14	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	16	448
పార్వతీపురం స్పెషల్	20	672
పార్వతీపురం సాధారణ	18	336

- వేములవాడ

రెవెన్యూ ఉద్యోగికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య భార్య రెవెన్యూ ఉద్యోగి దొమ్మాటి అంజలికి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అంజలి మరో ఉద్యోగురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై ఫీల్డ్ సర్వేలో భాగంగా వెళ్తుండగా వేములవాడలో మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అంజలిని పట్టణంలో ప్రథమ చికిత్స అనంతరం, అక్కడినుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం అంజలిని పలువురు ప్రజాప్రతినిధులు, ఆయాపార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులు పరామర్శించారు.

మండలానికి రూ.1.4 కోట్లు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని ఆయా గ్రామాలకు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధుల కింద రూ. కోటి 4 లక్షల నిధులు మంజూరైనట్లు బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ. 5 లక్షల నుంచి 15 లక్షల వరకు గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీలకు, ఇతర పనుల కోసం నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ఏష బోయిన రజితకు అత్యవసరంగా రక్తం అవసరపడడంతో స్పందించిన ముగ్గురు యువకులు రక్తదానం చేశారు. సిరిసిల్ల ఏరియాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరం ఉండటంతో మండల కేంద్రానికి చెందిన యువకులు కోల సంతోష్, గోలిపెల్లి ప్రవీణ్, ఎడ్ల కృష్ణ సిరిసిల్లకు వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ అభినందించారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గంభీరావుపేట: ఎస్సీ వర్గీకరణ అమలుకోసం డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన వెయ్యి గొంతులు-లక్ష డప్పులు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవునూరి ప్రభాకర్, కానాపురం లక్ష్మణ్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ నాయకులు, యువకులు, మేధావులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ రాకేష్, మండల నాయకులు అశోక్, రవి, దేవయ్య, సంతోష్‌లు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ముస్తాబాద్ మండల కన్వీనర్‌గా మల్లయ్య, కో కన్వీనర్‌లుగా దేవరాజులు, బాబు, వెంకటయ్య, శ్రీనివాస్, కనుకయ్య, దుర్గయ్య, రాజు, కిషన్ బాల పోచయ్య, శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాజ్యాంగం ప్రకారమే బిల్లు ప్రవేశపెట్టాలి

సిరిసిల్లటౌన్: రాజ్యాంగం నిబంధనల మేరకు ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ప్రజా సమీకృత సేవాకమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రవివర్మ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల సంఘాల విడగొట్టడంపై నియంత్రత ధోరణి కొనసాగుతుందన్నారు. 30 ఏళ్లుగా దళితులకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. అంబేద్కర్‌పై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌ఎంపీలకు అండగా విప్



మాట్లాడుతున్న ఆర్‌ఎంపీలు

వేములవాడఅర్బన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్ని విధాలా అండగా ఉంటూ సహకరిస్తున్నారని ఆర్‌ఎంపీ వైద్యులు పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ ఆర్‌ఎంపీ వైద్యులు పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైడింగ్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఆరోపించడం సరికాదన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు ఏమీ చేయలేదన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు రవీందర్, కరుణాకర్, రాజేందర్, బాలయ్య, నరేందర్, శంకర్, నర్సయ్య, వెంకన్న, సుధాకర్, అంజయ్య తదితరులున్నారు.

మున్సిపల్ సెస్ బకాయిలు చెల్లింపు



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ కార్యాలయం సెస్ విద్యుత్ బకాయి రూ.4 కోట్ల 15 లక్షలు పడింది. ఇందులో భాగంగా శుక్రవారం మొదటి విడతలో రూ. కోటి 12 లక్షల బకాయిని వేములవాడ సెస్ ఏఈ సిద్ధార్థకు చెక్కు ద్వారా చెల్లించినట్లు వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తెలిపారు. మిగతా మొత్తం బకాయి త్వరలోనే చెల్లిస్తామన్నారు.



కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో వెళ్లడంతో రహదారులు దెబ్బతింటున్నాయి. దీంతో రోడ్లన్నీ కొన్నినెలలకే ధ్వంసమవుతున్నాయి. రహదారులపై కేజీవీల్స్ తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : అంజయ్య, పంచాయతీ రాజ్, సెల్‌నంబర్ : 9848518443

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

జాతరకు హనుమాన్ ఆలయం ముస్తాబు



ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

: మాఘ అమావాస్య జాతరకు మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ కేశవ పెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న గుట్టపై ఈనెల 29న నిర్వహించే మహా జాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆలయం అభివృద్ధికి గ్రామస్తులు, వ్యాపారులు పెద్దఎత్తున విరాళాలు అందిస్తున్నారు. ఆలయంపై గోపురాన్ని నూతనంగా ఏర్పా టు చేశారు. శుక్రవారం ఉపాధిహామీ సిబ్బంది ఆ లయం పరిసరాలను శుభ్రం చేశారు. ఆలయం వద్ద కొత్తగా బోరు వేశారు. మాఘమావాస్య జాతరను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ పారిపల్లి రాంరెడ్డి, సభ్యులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మేగి నర్సయ్య, రవీందర్, బాల్‌రెడ్డి కోరారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



మరిమడ్లలో స్థలపరిశీలన చేస్తున్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పలుసార్లు గ్రామస్తులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రాలు అందించారు. అధికారులతో మాట్లాడి 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎన్‌పీడీసీఎల్, సెస్ అధికారులు గ్రామంలో స్థల పరిశీలన చేశారు. ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ (కన్‌స్ట్రక్షన్స్) ఎన్. అంజయ్య, ఏఈ జి. శ్రీనివాస్, సెస్ ఏడీఈ శ్రీధర్, ఏఈ దివ్య తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్, వాహనాల డ్రైవర్లు సీటుబెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఇక్కడ ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అప్పగింత

సిరిసిల్లకల్చరల్: అనాథ వృద్ధుడిని ఆల్ సీనియర్ సిటిజన్ల సంఘం వృద్ధాశ్రమంలో చేర్పించి నీడ కల్పించింది. సంఘం ప్రతినిధి గజ్జెల్లి రామచంద్రం సమాచారం మేరకు భూమయ్య అనే వృద్ధుడు అనాథగా నివసిస్తున్నాడు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం స్పందించి అతన్ని మండెపెల్లిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో చేర్పించేందుకు ఆదేశాలు ఇచ్చారు. డీడబ్ల్యూవో సూచనమేరకు సంఘం ప్రతినిధులు చేపూరి బుచ్చయ్య, జనపాల శంకరయ్య, మాదిరెడ్డి అంజనీదేవి తదితరులు సదరు వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించారు.



ప్రారంభించి ఏడాదైనా.. బోర్డు ఏది ?

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని బాలరాజుపల్లి గ్రామంలో నిర్మించిన ఈ గ్రామ పంచాయతీ భవనానికి నేమ్ బోర్డు లేకపోవడంతో కొత్తగా వచ్చిన వారంతా వింతగా చూస్తున్నారు. నేటికీ ఈ భవనం ప్రారంభించి ఏడాది పూర్తి కావస్తుంది. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినప్పటికీ ప్రత్యేక అధికారులు మాత్రం ఈ పంచాయతీ కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.